మహిళా సాధికారతకు కృషి

మంత్రి జూపల్లి కృష్ణారావు



వరలక్ష్మికి అవార్డును అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: మహిళా సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం రవీంద్రభారతిలో హెవెన్ హోమ్స్ సొసైటీ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి సేవా భారతి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళల కోసం అనేక చట్టాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న సమయంలో మన ఆలోచన ధోరణిలోనూ మార్పు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. చేనేత వస్త్రాలను ప్రోత్సహిద్దామని పిలుపునిచ్చారు. శాస్త్రీయ సంగీత సాంప్రదాయ నృత్య కళలను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ, విశ్రాంత జడ్జి నేరెళ్ల మాల్యాద్రి, సంస్థ అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన ర్యాలీ


బీఆర్ఎస్ నాయకుల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తుందని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు టి.జీవన్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. కాగా పోలీసులు ర్యాలీని అడ్డుకొని ముందుకు సాగనివ్వకుండా చేశారు. ఈ సందర్భంగా టి.జీవన్‌సింగ్ మాట్లాడుతూ..తెలంగాణ కోసం పోరాడిన తాము ఉద్యమ నాయకులమని అక్రమ అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు ఎన్ని అక్రమ కేసులు బనాయించినా తాము వెనకడుగు వేసేది లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వ అవినీతి, అక్రమ అరెస్టులను తాము ఖండిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరి సాగర్, ముత్యాల భాస్కర్, రేణుక, రాము తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయాలి

గోల్కొండ: అర్హులందరికీ సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లకు చెందిన మజ్లిస్ నాయకులతో టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో వేలాది కుటుంబాలకు సీఎం సహాయ నిధి, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, వితంతు, ఆసరా, వికలాంగులకు పెన్షన్లు లభిస్తున్నాయని, అయితే నేటికి ఎందరో అర్హులైన వారు సరైన అవగాహన లేక సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారు. మజ్లిస్ నాయకులు తమతమ ప్రాంతంలోని నిరుపేదలను కలిసి వారి వివరాలు సేకరించి వారు అర్హులైతే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరూస్‌ఫరాన్, అబ్బాస్ హుస్సేన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి


సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. కిషన్‌బాగ్‌లోని బ్రదరన్ చర్చిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవులకు అండగా నిలబడుతుందన్నారు. చర్చిలలో క్రిస్మస్ వేడుకలతో పాటు నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో జరిగే క్రిస్మస్ వేడుకలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పురా నియోజకవర్గం కోఆర్డినేటర్ బుర్రగళ్ల కాలేబ్, పెయ్యాల డేవిడ్, బి.ఆనందం, బ్రదర్ ఫ్రాన్సిస్, బ్రదర్ టోనీ, కొండా వెంకటస్వామి, సత్‌కీర్తి, ఆనంద్ కుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

గౌలిపురా: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని బీజేపీ సీనియర్ నాయకులు ఆచారి అన్నారు. బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్ మంగళ్‌ముఖి హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 66 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు పరుస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరమైనా ఇంత వరకు హామీలను నేరవేర్చలేదన్నారు. హైడ్రా, ఎఫ్‌టీఎల్, మూసీ నది వర్గీకరణ పేరుతో లక్షల కోట్లు దండుకోవడానికి పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఆలె జితేంద్ర, సహదేవ్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, నాయకులు మోకాళ్ల వెంకటేశ్, డొంకి యాదగిరి, గౌలీకర్ ధీరజ్‌లాల్, రఘుకాంత్, ప్రేమ్, భానుప్రకాశ్, యాకుత్‌పురా కంటెస్టెడ్ ఎమ్మెల్యే వీరేంద్ర బాబు యాదవ్, యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ బండ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాలలో పోషణ మహా కార్యక్రమం



సంతోష్‌నగర్: భారత ప్రభుత్వం మహిళా, బాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎండబ్ల్యూసీడీ) ప్రారంభించిన పోషణ మహా కార్యక్రమాన్ని బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్, విద్యాదాన్ సమితి మార్గదర్శకత్వంలో మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మూడో రోజు పోషణ మహా వేడుకల చివరి రోజు పోషకాహారం–శక్తి అనే అంశంపై వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన పోటీలను నిర్వహించారు. విద్యార్థులు చిరు ధాన్యాల గురించి, ఆహార భద్రతను, పోషక ప్రయోజనాలలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ పోటీలో విద్యార్థులను సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహిస్తూ సంప్రదాయ ఆహారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్ రావు, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ ఆనందవల్లి, పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



జియాగూడ: కార్వాన్ టోలీ మజీద్ ప్రాంతంలో ఓ ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు, ఎస్టీఎఫ్ టీమ్ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జరిపిన దాడుల్లో అలీంఖాన్ అనే వ్యక్తి ఇంట్లో నలుగురు యువకులు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు. నలుగురి వద్ద 2.1 కిలోల గంజాయి లభించింది. వారు గంజాయిని అమ్మకాలకు తీసుకువెళ్లే నాలుగు బైకులను, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులపై కేసు నమోదు చేశారు. నలుగురిని అరెస్టు చేశారు. గంజాయి అమ్మకాలతో పట్టుబడిన నిందితుల్లో ఎండీ సలీంఖాన్, ఎండీ ఇంతియాస్ ఖాన్, వంశీకృష్ణ, సోనులను అరెస్టు చేశారు. అమర్, సల్మాన్, నరేందర్, తుజ్లాసింగ్, కృష్ణ కుమార్‌లు పరారీలో ఉన్నారని ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. వీరితో పాటు 31 మంది వినియోగదారుల పేర్లను కూడా కేసులో చేర్చారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌లో ధూల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, గోపాల్, ఎస్టీఎఫ్ ఎస్సైలు లలిత, భాస్కర్, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాష్, వికాస్ ఉన్నారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా పలువురు అబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


నివాళులర్పిస్తున్న ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్


గాంధీభవన్‌లో..టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా, సునీతారావు


వేడుకల్లో లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు తదితరులు


వేడుకల్లో గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు కోళ్ల ప్రదీప్‌రాజ్, టంపు పహిల్వాన్, వినోద్ యాదవ్


వేడుకల్లో హైదరాబాద్ డీఐజీ రోహిణి, కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్


హరిదాస్‌పురాలో..బోగి మహేష్ తదితరులు


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు


అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


నివాళులర్పిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు బోయిని విజయకుమార్ తదితరులు


నివాళులర్పిస్తున్న వినయ్ కిషోర్ యాదవ్, బర్ల శ్రావణ్ కుమార్, సోను, పిల్లి గణేష్


నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఏవి.రాజశేఖర్ తదితరులు


లంగర్‌హౌస్‌లో నివాళులర్పిస్తున్న చంటిబాబు తదితరులు


తెలుగు వర్సిటీలో నివాళులర్పిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ జగదీష్


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

పాతబస్తీలో సభ్యత్వ నమోదు

యాకుత్‌పురా: జర్నలిస్టు సంఘాలు జర్నలిస్టుల పక్షాన ఉండాలే తప్ప పాలకుల పక్షాన ఉండడం ప్రమాదకరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం పాతబస్తీ హరిబౌలిలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) సభ్యత్వ నమోదు జరిగింది. హెచ్‌యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు చలువాది విజయానందరావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, కార్యదర్శి రాజశేఖర్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు సర్వేశ్వర్‌రావు, సదాశివం రమేష్, బుర్రగల్ల కాలేబ్, పెండ్యాల లక్ష్మణ్, వెంకటస్వామి, బ్రహ్మయ్య, రఫీ, ముత్యాలు, సూర్యం, సాదత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. శివశక్తి నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాధా నృత్య నిలయం 22వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు రాధామోహన్ శిష్యబృందం చేసిన పార్వతి కల్యాణం భరత నాట్య నృత్య రూపకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. శివశక్తి పేరిట సాగిన ఈ నృత్య రూపకం ప్రేక్షకులను సమ్మోహన పరిచింది. మంగళపల్లి బాల మురళీకృష్ణ గరుడ ధ్వని థిల్లానా అంశానికి మొట్టమొదటిసారి భరతనాట్య నృత్యంతో నటరాజస్వామి, పార్వతీ దేవిలకు సమర్పిస్తూ సాగిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు సీతారామయ్య, వేదాంతం రాధేశ్యామ్, వెంపటి శ్రీవల్లి శర్మ, మంజుల శ్రీనివాస్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి హౌస్ అరెస్ట్



హౌస్ అరెస్టులో మహమ్మద్ సలావుద్దీన్ లోది

చార్మినార్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమాన్ని పక్కనపెట్టి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పనున్నారని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది అన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం నిరసన తెలియజేయనున్న సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మహమ్మద్ సలావుద్దీన్ లోదిని మీర్‌చౌక్ పోలీసులు గురువారం తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది కాలంలో ఏ ఒక్క హామీని నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలో కేవలం ఒకే ఒక పథకాన్ని అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు గుణపాఠం చెప్పనున్నారన్నారు.

చుట్టపు చూపుగా వచ్చి నగలు తస్కరించారు

రెండు గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

విజయనగర్‌కాలనీ: చుట్టపు చూపుగా వచ్చి బంధువుల ఇంట్లోని నగలు తస్కరించుకుపోతుండగా పోలీసులు పట్టుకొని కటకటాలోకి పంపిన ఘటన శుక్రవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ కె.విజయ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ సైతాన్‌గల్లీలో డి.శివానందు(26) నివసిస్తున్నాడు. ఈ నెల 5న వీరికి దూరపు బంధువులైన తల్లీ కూతుళ్లు ఉదయం 8 గంటలకు వచ్చారు. కృష్ణ జిల్లా కంచికచెర్ల డీవీఆర్ మోడల్ కాలనీకి చెందిన ముత్యాల విజయకుమారి(41), ఈమె కూతురు ఖమ్మం జిల్లాకు చెందిన నేలకొండపల్లి కట్టుకాచారం గ్రామానికి చెందిన బండారుపల్లి వైష్ణవి(23) గృహిణులు. కాగా శివనందు సోదరి వివాహ నిమిత్తం 20 తులాల బంగారు నగలు తీసుకువచ్చి ఇంట్లో భద్రపరిచినట్లు తల్లీకూతుళ్లు తెలుసుకొని కుటుంబ సభ్యులు ఏమరుపాటుగా ఉండగా బంగారు నాజెలను తస్కరించి సాయంత్రం 5 గంటలకు వారి ఇంటి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిన అనంతరం కొద్ది సేపటి తర్వాత ఇంట్లో దాచిన నగలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన శివనందు వెంటనే ఆసిఫ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆసిఫ్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.రఘునాథ్‌రావు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక టీమ్‌లు నగరంలోని వివిధ ప్రాంతాల్లో గాలించారు. రెండు గంటల అనంతరం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో విజయవాడ వెళ్లేందుకు బస్‌స్టేషన్‌లో నిలుచొని ఉన్న నిందితులు తల్లీకూతుళ్లను అదుపులోకి తీసుకొని రూ.14 లక్షల విలువ చేసే 20 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ.సి.హైమా, ఏఎస్‌ఐ దయానంద్, పీసీలు వై.బాలప్రసాద్, సి.శివకుమార్, బి.సంతోష్‌కుమార్, ఎస్.వైశేషిత, హలీమాబేగం తదితరులు పాల్గొన్నారు.



రోహిత్‌లాల్ యాదవ్‌కు సన్మానం


రోహిత్‌లాల్ యాదవ్‌ను సత్కరిస్తున్న బజరంగ్ గోప్ యాదవ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన రోహిత్‌లాల్ యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బజరంగ్ గోప్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోహిత్‌లాల్ యాదవ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను అందరికీ అందే విధంగా కృషి చేస్తానన్నారు. బజరంగ్ గోప్ యాదవ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెట్టు వెంకటేష్, సునిల్ సాహు, గోపాల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు


ఖాజీపురాలో ప్రధాన రోడ్డులో కుంగిపోయిన మ్యాన్‌హోల్

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఖాజీపురాలో మ్యాన్‌హోళ్లకు మూతలు లేకుండా ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, కార్లు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.